అల్లరివాడే కానీ అల్లరిపనులు చేసేవాడు కాదని నీ మంచితనపు గుబాళింపుల ఘుమఘుమలు గురించి చెప్పనా?

స్వచ్ఛతకు సరైన చిరునామా నావాడే అని, నీ పేరే పలుమార్లు ఉచ్చరించనా?

సముద్రపు అలలపై వెండివెలుగు చూస్తున్నప్పుడూ కైలాసగిరి అందాలు తిలకిస్తున్నప్పుడూ కలగని ఆనందం నీ సాన్నిధ్యంలోనే నే పొందేది!

మరలిరా నేస్తమా ..... మరిక ఆగమాకు నాకు సుదూరంగా ..... నీ జంటలేక ఒంటరిగా గడుపుతున్న జీవితం ఓ గెలాక్సీలో నేనొక్కదాన్నే అయిన భావం మదిలో గుబులు పుట్టిస్తోంది.....

"ఠంగ్" ప్రియుడి తలపుల్లో తలుపులు మూసుకుని బందీ అయినట్టు బాహ్యప్రపంచాన్ని మరచిన మనస్విని జాగృతంచేస్తూ మోగింది వాల్‌క్లాక్.

* * * * *

ఒంటిగంటయినట్టు రిసెప్షనిస్ట్ వెనుక వాల్‌క్లాక్ మోగటంతో అప్పటి వరకూ కళ్ళు మూసుకుని వున్న అభిరాం చటుక్కున కళ్ళు తెరిచాడు. ఎదురుగా వరప్రసాదం అప్పటికే లేచి నుంచుని డాక్టర్ దగ్గరకు వెళ్ళడానికి ఉద్యుక్తుడై వున్నాడు.

ఒక్క క్షణం అభిరాంకి, వరప్రసాదంమీద జాలి, గౌరవం రెండూ కలిగాయి. 'ఎవరికి ఎవరం? చిన్నతనంలో తను అమ్మమ్మ దగ్గర పొందిన మురిపానికి తన స్నేహితుడి కోసం తనతోపాటూ నిద్రాహారాలు మానుకుంటున్నాడు' అనుకున్నాడు.

ఇద్దరూ తిరిగి డాక్టర్ గదికి చేరుకున్నారు. అతనూ అప్పుడే లేచి మహదేవ్ గదికి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నాడు. "వచ్చారా? రండి వెళదాం" అంటూ మహదేవ్ గదివైపు నడిచారు ముగ్గురూ.

'మహదేవ్‌కి తెలివి రావాలి. అతనికేం కాకూడదు' మనసులోనే భగవంతుని ప్రార్థించాడు అభిరాం.

డాక్టర్ మహదేవ్ గది తలుపులు తెరిచాడు. అప్పుడే ఓ నర్స్ ఖాళీ అయిన సెలైన్ బాటిల్ స్థానంలోనే కొత్తది అమరుస్తోంది. మహదేవ్‌కి తెలివిరాలేదు.

ముగ్గురూ బయటికివచ్చి వెయిట్ చేయసాగారు. క్షణాలు కూడా యుగాల్లా గడుస్తున్న భావన అభిరాంలో. వరప్రసాదం మొహం భావరహితంగా వుంది. డాక్టర్ పరిస్థితి మాత్రం ఇద్దరికీ భిన్నంగా వుంది.

'తను ఎక్స్‌పెక్ట్ చేసిన టైంకి ఎందుకు పేషెంట్‌కి తెలివి రాలేదు?' అనుకుంటున్నాడతను.

'తన అంచనా తప్పయిందా? అంటే ..... పేషెంట్ ..... కోమాలోకి జారుకుంటున్నాడా ..... ?' ఎందుకో ఒక్కసారి అతనికి అరచేతులు చెమట పట్టిన భావన. జేబులోంచి కర్చీఫ్ తీసి తుడుచుకున్నాడు.

ఇంతలో మెల్లగా మహదేవ్ గది తలుపు తెరుచుకుంది. తెల్లని దుస్తుల్లో ఉన్న నర్స్ శాంతి సందేశం మోసుకొస్తున్నట్లుగా వారి వద్దకు వచ్చి --

"డాక్టర్! పేషెంట్‌కి తెలివొచ్చింది" అని చెప్పింది. వాళ్ళ ముగ్గురిలో ఆమె మాటలకి ముందు సంతోషించింది డాక్టర్ మాత్రమే.

అభిరాం, వరప్రసాదంలు మాత్రం ఇంకా భయపడుతూనే వున్నారు. 'తెలివొచ్చినా లాభంలేదు. అతను జ్ఞాపకశక్తి పోగొట్టుకుంటే మాత్రం లాభమేముంది?' అనుకున్నారిద్దరూ.

ముందుగా డాక్టర్ గదిలోకి ప్రవేశించాడు. వెనకే వరప్రసాదం! చివరికి లోపలికి వెళ్ళింది అభిరాం.

మహదేవ్ కనులు తెరిచే వున్నాయి. తనెక్కడోన్నదీ అర్థం కానట్లు వెర్రిచూపులు చూస్తున్నాడు. తన ప్రక్కనే వున్న స్టాండ్‌వైపు దానికి అమర్చిన సెలైన్ వైపూ చూసుకున్నాడు. తర్వాత అతని దృష్టి డాక్టర్‌మీద పడి ప్రశ్నార్థకమయింది!

అతని పక్కన నుంచున్న వరప్రసాదాన్ని అయోమయంగా చూశాడు. వారిద్దరి వెనుకనుంచీ అంతా చూస్తున్న అభిరాంకి మహదేవ్ జ్ఞాపకశక్తి పూర్తిగా పోగొట్టుకున్నాడనిపించింది.

"మీరిటు రండి అభిరాం" అన్న డాక్టర్ మాటలకు నిస్తేజంగా అటు నడిచాడు అభిరాం.

నర్స్ ఓ వారగా నుంచుని చూస్తోంది.

మహదేవ్ దృష్టి అభిరాం మీద పడింది ..... చిన్నగా గొణిగాయ్ అతని పెదవులు. అభిరాం అయోమయంగా చూశాడు.

"అభిరాం!" వేరే గ్రహంనుంచి శాటిలైట్ ద్వారా అతి చిన్నగా విన్పించునట్లు అతని చెవులకు సోకాయి మహదేవ్ ఉచ్చరించిన అక్షరాలు.

అంతే! అప్పటిదాకా అతనిలో దాగున్న అనుమానాలూ, భయాలూ అన్ని పటాపంచలై పోయాయ్. "మహదేవ్‌కి జ్ఞాపకశక్తి పోలేదు. ఓగాడ్! నువ్వున్నావయ్యా! నా మొర విన్నావ్....." ఆనందంతో అభిరాం మనసు నురుగులతో పరవళ్ళు తొక్కుతున్న సముద్రమై ఉప్పొంగింది. వరప్రసాదం, డాక్టర్‌లు రిలీఫ్‌గా ఫీలయ్యారు.

"అభిరాం! పేషెంట్‌ని ఎక్కువసేపు మాట్లాడించకండి! జస్ట్ ఓ టూ మినిట్స్ మాత్రం మాట్లాడి వచ్చేయండి" అని బయటకు నడిచాడు డాక్టర్.

అభిరాం. వరప్రసాదం మహదేవ్‌కి దగ్గరగా కుర్చీలు లాక్కుని కూర్చున్నారు. మహదేవ్ చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా పట్టుకున్నాడు అభిరాం.

మహదేవ్ వరప్రసాదం వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

అతనెవరో అర్థంకాలేదతనికి.

"అమ్మమ్మ ఊరివారే వీరు. పేరు వరప్రసాదం. మనకి కావలసిన వారు" పరిచయం చేశాడు అభిరాం.

అతనికి విష్ చేస్తున్నట్టు కుడి చెయ్యి ఎత్తి కదిలించాడు మహదేవ్.

"ఫర్వాలేదు బాబూ! కదలకండి" అన్నాడు వరప్రసాదం.

"అమ్మమ్మకి చెప్పావా?" మెల్లగా అడిగాడు శక్తి కూడదీసుకుంటూ మహదేవ్.

"లేదు. మనస్వినికి కూడా చెప్పలేదు. నీక్కొంచెం నయమయ్యాక చిన్న గాయాలే అని చెప్పి తీసుకొద్దామని" వివరించాడు అభిరాం.

"మంచిపని చేశావన్నట్టు" అతని వంక ప్రసంశగా చూశాడు మహదేవ్.

"ఇంక రెస్ట్ తీసుకోండి మహదేవ్ బాబూ! మేం బయటనే వుంటాం" అతనికి స్ట్రెయిన్ ఇవ్వకూడదని అన్నాడు వరప్రసాదం.

"సరే"నన్నట్టు తలూపాడు మహదేవ్.

అభిరాం మాత్రం అతన్ని వదలలేనట్లు యింకా అక్కడే కూర్చుని వున్నాడు.

"ఇంక పేషెంట్ని రెస్ట్ తీసుకోనియ్యండి. ఎక్కువ స్ట్రెయిన్ అవకూడదు" చెప్పింది నర్స్.

తప్పనిసరై లేచి నిలబడ్డాడు అభిరాం.

"రెస్ట్ తీసుకో! ఇక్కడే వుంటాం" అని బయటికి నడిచాడు అభిరాం. అతనికోసం బయట ఎదురుచూస్తున్నాడు వరప్రసాదం.

ఇద్దరూ కలిసి డాక్టర్ గదిలోకి నడిచారు.

"నా అంచనా తప్పకుంటే మరో రెండు రోజుల్లో లేచి తిరగ్గలరు మీ ఫ్రెండ్. ఆ తర్వాత ఓ నాలుగైదు రోజులుంటే ఇంటికి వెళ్ళొచ్చు" అన్నాడతను.

ఇద్దరి మనసులూ తేలికపడ్డాయి.

"నేను వెళ్ళిపోతున్నాను. మళ్ళీ రేపు మార్నింగ్ ఎర్లీ అవర్స్ నుంచీ నా డ్యూటీ! ఏదయినా ప్రాబ్లముంటే వెంటనే నాకు ఫోన్ చేయండి. ఇది నా విజిటింగ్ కార్డ్. హాస్పిటల్, రెసిడెన్స్ అడ్రస్‌లతోపాటు ఫోన్ నెంబర్లు కూడా వున్నాయి. అయినా అవసరం రాకపోవచ్చు. డ్యూటీ డాక్టర్ వుంటారుగా ....." అని చెప్పేసి బయటకు నడిచాడతను.

"మీరు వెళ్ళి భోజనం చేసి రండి" వరప్రసాదంతో అన్నాడు అభిరాం.

"ముందు మీరు తినేసి రండి! నా భోజనానికి వేళాపాళా వుండదు" బదులిచ్చాడతను.

*　　*　　*　　*　　*

ఆ సాయంత్రానికి మహదేవ్ పరిస్థితి మరికొంచెం బాగుపడింది. వరప్రసాదం అతని దగ్గరుండగా అభిరాం ఓసారి తన ఆఫీస్‌కు వెళ్ళి అన్నీ సవ్యంగా జరుగుతున్నాయని తెలుసుకుని వెనక్కి వచ్చేశాడు.

ఒకరి తర్వాత ఒకరుగా మహదేవ్‌ని కంటికి రెప్పలా వాళ్ళిద్దరూ చూసుకున్నారు.

*　　*　　*　　*　　*

రెండు రోజులు గడిచాయి. ఇప్పుడు మహదేవ్ మామూలుగా తిరగగలుగుతున్నాడు.

కొంచెం నిస్సత్తువ మాత్రం అతన్నింకా ఆవరించుకుని వుంది. మనసు మాత్రం హుషారుగానే వుంది.

ఇంతలో పేషెంట్ల హెల్త్ కండిషన్ తెలుసుకోడానికి రౌండ్స్ కొచ్చిన చీఫ్ మహదేవ్ గదిలోకొచ్చాడు. అతనికి ఏభై ఏళ్ళుంటాయ్. మనిషి నల్లగా, పొట్టిగా వుంటాడు. అతన్ని చూడగానే మొహం పందిమొహంలా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అదే అతనిలో ప్రత్యేకత! మాట మాత్రం సౌమ్యం. అతనెళ్ళిపోయాక చిన్నగా నవ్వుతూ "అతన్ని చూస్తే పంది రూపంలో వున్న మనిషిలా లేడూ?" అన్నాడు అభిరాం. అవునన్నట్టు తలూపాడు వరప్రసాదం.

"పొరపాటు! అతన్ని చూస్తే ఓ జీవిత సత్యం ..... శాస్త్రవేత్తలు మాటలు నిజమని తెలుస్తున్నాయి" అన్నాడు మహదేవ్.

తమ సంభాషణలో అతనూ పాలుపంచుకోవడంతో సంతోషం కలిగిన అభిరాం- "ఏమిటా జీవిత సత్యం? ఏం చెప్పారు శాస్త్రవేత్తలు?" అన్నాడు.

"క్షీరదాల్లో మానవునికి అత్యంత పూర్వీకులు పందులను పోలిన జంతువుల రూపంలో వుండేవారని శాస్త్రవేత్తలు అంటున్నారు.

పంది ఆకారాన్ని కలిగి వున్న ఈ జీవులు ఇరవై అయిదుకోట్ల సంవత్సరాల తర్వాత నేటి మనిషిగా పరిణామం చెందాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ జీవులకు సంబంధించిన ఆధారాలు దక్షిణాఫ్రికాలోని ఎడారి ప్రాంతంలో శాస్త్రవేత్తలకు లభ్యమయ్యాయి. పెరిమియన్ యుగానికి చెందిన ఈ అరుదైన నమూనాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు.

ఇంతకుముందువరకూ క్షీరదాల్లో మానవునికి అత్యంత పూర్వపు తరం రాక్షస బల్లులని భావించేవారు. అయితే ఈ నూతన పరిశోధనతో ఇంతవరకూ వాడుకలో వున్న సిద్ధాంతాలన్నీ తారుమారయ్యే పరిస్థితి ఏర్పడింది. రాక్షస బల్లులకంటే ముందు పెరిమియన్ యుగంలో పందుల రూపంలో వుండే జీవులే భూమిపై ఆధిపత్యాన్ని చెలాంచేపని పరిశోధకులు తెలుపుతున్నారు.

"లిస్ట్రోసార్"ను మొట్టమొదటి క్షీరదంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఆ రోజులలో సంభవించిన భయంకర ప్రళయంలో పెరిమియన్ యుగంలోని ఈ జీవులలో చాలామట్టుకు నశించిపోయి వుంటాయని ఈ పరిశోధనా బృందానికి చెందిన నిపుణులు తెలిపారు. ప్రకృతి కన్నెర్రతో నశించిపోగా మిగిలిన లిస్ట్రోసార్‌లు ఆ తర్వాత కొంతకాలానికి "ట్రియాసిక్, జురాసిక్" యుగాల్లో రాక్షస బల్లులుగా పరిణామం చెందాయి.

మనకు లభ్యమయ్యే ఆధారాలను బట్టి శాస్త్రీయంగా మానవునికి మొదటి పూర్వీకుడిని కూడా కనుగొన్నట్లు అయింది.

"లిస్ట్రోసార్" నుంచే భూమిపై క్షీరదాల జీవితం ప్రారంభమయి వుంటుందని భావిస్తున్నారు.

పంది ఆకారంలో ఉండే ఈ జీవులు సముద్రంలో నుంచి భూమి పైకి వచ్చి జీవనాన్ని ప్రారంభించాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే జీవ పరిణామ క్రమంలో ఈ జీవులకు, రాక్షస బల్లులతో పాటు తర్వాత తరాలకు చెందిన క్షీరదాలకు ఎక్కడో లింక్ తెగిపోయింది.

ఈ జీవుల ఎముకలు చాలా పలచగా వున్నాయనీ, వీటి ద్వారానే ఇవి ఉష్ణరక్త జీవులని తెలుస్తుందని పరిశోధకులు తెలుపుతున్నారు.

ఇంతవరకూ ఏవో చిన్న జీవులు కొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత రాక్షస బల్లులుగా పరిణామం చెందాయని భావించేవారు. ఈ పరిశోధనలు ఆ సిద్ధాంతాలు సరైనవి కావని తేల్చాయి.

లిస్ట్రోసార్ మనకు బహుదూరపు బంధువని బ్రిటన్, వాషింగ్టన్‌ల పరిశోధనా బృందానికి సమన్వయకర్తగా పనిచేస్తున్న బ్రిటిష్ జీవశాస్త్రవేత్త పీటర్ వార్డ్ అన్నారు. ఈ జీవులే ఆ తర్వాత క్రమంలో రాక్షసబల్లులుగా, ఉడుతలు, కోతులుగా పరిణామం చెందాయని ఆ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

18 కోట్ల సంవత్సరాల కిందట రాక్షస బల్లులను సర్వనాశనంచేసిన ప్రళయం కంటే 10 రెట్లు పెద్దదైన భీభత్సం ఏర్పడి ఈ లిస్ట్రోసార్‌లు చాలామట్టుకు తుడిచిపెట్టుకుపోయాయని ఈ పరిశోధనా బృందం పేర్కొంది.

అప్పట్లో అగ్నిపర్వతాలు బద్దలు కావడమో, భూమి చీలిపోవడమో గ్రహ శకలాలకు ఢీకొనడమో జరిగి అంతటి ప్రళయం సంభవించినప్పటికీ లిస్ట్రోసార్‌లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదు. అందులో కొన్ని జీవించి వుండటం వల్లనే నేడు మనం ఈ భూమిపై ఉండగలిగాం. లేక పోతే మానవజాతి అంటూ వుండకపోయేది.

ఇలాంటి భీకర ప్రళయాల భూమిపై ఇప్పటికి ఐదుసార్లు సంభవించి వుంటాయని. చివరి ప్రళయంలో రాక్షస బల్లులు అంతరించిపోయాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. వాతావరణ కాలుష్యం వలన భూగోళం వేడెక్కిపోతుందని, దీనితో ఆరవ ప్రళయం సంభవించవచ్చునని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు.

మరో 400 సంవత్సరాలలో భూమిపై వున్న 60 శాతం జీవులు నశించిపోయే అవకాశం వుంది. ఈ ప్రమాదంనుంచి ప్రాణికోటిని రక్షించాల్సిన బాధ్యత ..... ''

''ఆ భగవంతుడిదే!'' అతని మాట సరిగ్గా పూర్తి కాకుండానే అందుకున్నాడు అభిరాం.

'' ..... కాదు మానవుడిదే'' అంటూ పూర్తిచేశాడు మహదేవ్.

వరప్రసాదం నవ్వుతూ తలవూపాడు.

* * * * *

మేడం ప్రమీలాదేవి గదిలో ఫోన్ మోగింది. అప్పుడు సమయం సాయంత్రం ఆరవుతోంది.